క్లుప్తంగా

నేడు గడప గడపకు..

సత్యవేడు: మండలంలోని దాసుకుప్పం పంచాయతీలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారని పార్టీ మండల కన్వీనర్ సుశీల్ కుమార్ రెడ్డి తెలిపారు. మండల అధికారులు, పార్టీ నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచులు, సచివాలయ సిబ్బంది హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు, రేపు ఐఎఫ్‌పీపై శిక్షణ తరగతులు

సత్యవేడు : విద్యాబోధన అంశాలకు సంబంధించి పుత్తూరు సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో 10, 11 తేదీలలో నిర్వహించు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ (ఐఎఫ్‌పీ) శిక్షణ తరగతులకు సత్యవేడు ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు హాజరు కావాలని ఎంఈఓ కె.రవి కోరారు. పీవీపురం, మాదనపాలెం, ఇరుగుళం, సత్యవేడు బాలుర హైస్కూళ్లు, సత్యవేడు బాలికల పాఠశాల, మదనంబేడు, రాజగోపాలపురం, పుదుకుప్పం, దాసుకుప్పం, గురుకుల బాలుర పాఠశాలలు, శిరునంబూదూరు, ఏఎం పురం, కన్నావరం ఉపాధ్యాయులు ఈ శిక్షణ తరగతులకు హాజరు కావాలని ఆయన కోరారు.

విద్యార్థులకు ఉచితంగా బియ్యం పంపిణీ



విద్యార్థులకు ఉచితంగా బియ్యం అందజేస్తున్న మునిశేఖర్

ఏర్పేడు: మండలంలోని రాజులపాలెం ఎస్టీ కాలనీలోని యువనేస్తం అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం విద్యార్థులకు ఉచితంగా బియ్యం పంపిణీ చేశారు. సంస్థ వ్యవస్థాపకుడు మునిశేఖర్ మాట్లాడుతూ, ఎస్టీ గ్రామాల్లో బడిఈడు పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాలన్నారు. సంస్థ తరపున వివిధ ఎస్టీ కాలనీల్లో వలంటీర్లను ఏర్పాటు చేసి సాయంత్రం విద్యార్థులకు ట్యూషన్ చెబుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు జస్వంత్, వినోద్, మునెమ్మ, వెంకటేష్, అరుణ, నాగమణి, హేమలత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి



స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాల్సిన బ్రిడ్జి ప్రదేశం

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): మండలంలోని పాయ్య గ్రామ సమీపంలో నాయుడుపేట–పూతలపట్టు ఆరులేన్ల హైవే పనులు జోరుగా సాగుతున్నాయి. అయితే సమీపంలోఉన్న బ్రిడ్జి నుంచి కింద నుంచి విద్యార్థులు రోడ్డు ఇరువైపులా దాటి పట్టణంలోని పాఠశాలలకు వెళుతుంటారు. ఇక్కడ స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం, వాహనాలు వేగంగా వెళ్తుండడంతో విద్యార్థులు రోడ్డు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.


యథేచ్ఛగా రహదారి ఆక్రమణ



పన్నూరు సబ్‌స్టేషన్ నాలుగు రోడ్ల కూడలి

విజయపురం (నగరి): మండలంలోని పన్నూరు సబ్‌స్టేషన్ నాలుగు రోడ్ల కూడలి వద్ద షాపు యజమానులు, చిరువ్యాపారులు రహదారికి ఇరువైపులా రోడ్డు ఆక్రమించడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఇటీవల సిమెంట్ రోడ్డు వేసినా ప్రయోజనం లేకుండాపోతోంది. షాపు యజమానులు ఆర్ అండ్‌బీ రోడ్డును ఆక్రమించుకున్నారని గతంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు. ఫలితంగా రాకపోకలు సాగించడం కష్టంగా ఉందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రోడ్డును సర్వే చేయాలని కోరుతున్నారు.

వేగంగా గ్యాస్‌పైప్ పూడిక పనులు



బైపాస్‌లో జరుగుతున్న పనులు

నగరి: ఇంటింటికీ గ్యాస్ సరఫరాలో భాగంగా గ్యాస్‌పైపుల పూడిక పనులు వేగంగా జరుగుతున్నాయి. నగరి బైపాస్ రోడ్డులో ప్రస్తుతం గ్యాస్‌పైపుల అమరిక పనులు జరుగుతోంది. పైపుల పూడిక పనులు ఇంకా 15 కిలోమీటర్ల మేర తిరుత్తణి వరకు జరగాల్సి ఉంది. అక్కడ ఏర్పాటు చేసే ఫిల్లింగ్ స్టేషన్ వరకు పూడిక పనులు పూర్తయితే పైపుల ఏర్పాటు పనులు పూర్తయినట్లే అని లేబర్ కాంట్రాక్టర్ తెలిపారు.

‘మృత్యు’ మలుపులు

- ప్రమాదాలకు నిలయాలు
- ఆందోళన చెందుతున్న వాహనదారులు

మండలంలోని తడ–శ్రీకాళహస్తి రోడ్డులోని మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా ఉంటున్నాయి. 25 కిలోమీటర్ల పరిధిలో ఈ రోడ్డు వెంబడి 16 మలుపులు ఉన్నాయి. ఈ మార్గంలో ఇరువైపులా 20 గ్రామాలున్నాయి. మలుపుల వద్ద ఏ మాత్రం ఆదమరచినా ఇంక అంతే సంగతి. పలు ప్రమాదాల్లో ఇప్పటికే కొంతమంది చనిపోయారు. తీవ్ర గాయాలై వికలాంగులైన వారూ ఉన్నారు. తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా వీటికి అడ్డుకట్ట వేసే దిశగా సంబంధిత అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలొస్తున్నాయి.

బుచ్చినాయుడుకండ్రిగ: శ్రీకాళహస్తి నుంచి తడ మార్గంలో మండలంలోని చల్లమాంబపురం, పార్లపల్లె, పల్లమాల, పల్లమాలకండ్రిగ, కాళంగి వంతెనకు ఇరువైపులా, అలాగే ఆరిగికండ్రిగ, విజయగోపాలపురం, పదవమైలు, కాంపాళ్లెం సెంటర్, తానిగిలు, నెరిణికండ్రిగ, కారణి, నెలవాయి, తలారివెట్టు, ఎన్‌టీఆర్ నగర్ గ్రామాల వద్ద మలుపులు ఉన్నాయి. రెండు లేన్ల రోడ్డు కావడంతో వాహనాలు వేగంగా వెళ్తుంటాయి. రోజూ సగటున 3 వేల పైచిలుకు వాహనాలు వెళ్తుంటాయి. వీటిలో కంటైనర్ లారీలే ఎక్కువ.ఈ మలుపులు ఎస్, ఎల్ ఆకారంలో ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మితిమీరిన వేగంతో వచ్చే వాహనాలు అదుపు తప్పి ఢీకొంటున్నాయి. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడటం నిత్యకృత్యమైంది.



నెరిణికండ్రిగ గ్రామం వద్ద ఉన్న మలుపు, కారణి వద్ద ఉన్న మలుపు, (ఇన్‌సెట్) విజయగోపాలపురం మలుపు వద్ద ఆటోను ఢీ కొన్న లారీ

మలుపుల్లో ఐదుగురు మృత్యువాత

విజయగోపాలపురం వద్దనున్న మలుపు వద్ద ఆటోను లారీ ఢీకొనడంతో ఐదుగురు మృత్యువాత పడ్డారు. మయూర సూదలగుంట షుగర్ కర్మాగారంలో పనిచేస్తున్న రామారావు (52) ఆయన భార్య కన్యాకుమారి (45), కుమార్తె బిందుమాధవి, మరో యువకుడు అనంత్‌రామ్ (17) ఆటో డ్రైవరు వెంకట్రామయ్య మృతి చెందారు. అలాగే పురుషోత్తం, ఆయన భార్య మహాలక్ష్మి, మహాలక్ష్మి మేనల్లుడు శశాంక్, ప్రయాణికుడు నారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన 2019 ఫిబ్రవరి 13న చోటుచేసుకుంది. ప్రధానంగా రాత్రి వేళ ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. ఆర్ అండ్ బీ అధికారులు ప్రమాదకర మలుపుల ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లతో పాటు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని పదే పదే కోరుతున్నా పట్టించుకోవడం లేదని వాహనదారులు మండిపడుతున్నారు.

రోడ్డు బాగుచేయండి సారూ!

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): మండలంలోని చియ్యవరం టర్నింగ్ నుంచి ఎల్లకారు రైల్వే స్టేషన్‌కు వెళ్లే రోడ్డు మార్గం ప్రమాదాలకు తావిస్తోంది. రోడ్డు దెబ్బతిని, కోతకు గురైనట్లు కంకర తేలింది. దీంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే మార్గంలో రాత్రి సమయంలో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేయాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.



ఇరువైపులా అధ్వానంగా రోడ్డు

‘ఎస్’ మలుపుల వద్దే ప్రమాదాలు ఎక్కువ

మండలంలోని కేటీరోడ్డు వెంబడి ఉన్న మలుపు వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి. పదవమైలు, తానిగిల్లు, నెరిణికండ్రిగ, కాళంగి వంతెన వద్ద ఎస్ ఆకారంలో మలుపు ఉండడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు.

– గురవయ్య, వాహనదారుడు

ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం

కేటీ రోడ్డుకు ఉన్న మలుపులకు వేగ నిరోధకాలను ఏర్పాటు చేయాలని ఫిర్యాదు చేసినా ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదు. రద్దీగా ఉండే రోడ్డు కావడంతో మలుపు వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి.

– బాలశేఖర్, వాహనదారుడు, నెరిణికండ్రిగ

స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేస్తాం

కేటీరోడ్డు వెంబడి ఉన్న మలుపుల వద్ద స్పీడ్‌బ్రేకర్లను త్వరలోనే ఏర్పాటు చేస్తాం. మలుపులు ఎస్ ఆకారంలో ఉండడంతో ప్రమాదాలు జరుగుతుండటం వాస్తవమే.

– శ్రీనివాసులు, ఆర్‌అండ్‌బీ డీఈ

ఘనంగా అంకమ్మకు పొంగళ్లు



అంకమ్మ ఆలయం ముందు భక్తుల సందడి, (ఇన్‌సెట్) పూల అలంకరణలో అంకమ్మ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో వేణుగోపాలపురంలోని గ్రామదేవత అంకమ్మకు ఆదివారం గ్రామస్తులు ఘనంగా పొంగళ్లు పెట్టారు. అంబలి పోసి మొక్కులు చెల్లించారు. అమ్మవారి విగ్రహానికి అభిషేకాలు చేసి, ప్రత్యేక పూజలు చేసి, హోమాలు చేశారు. ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు.

సచివాలయ నిధులతో అభివృద్ధి పనులు



సుద్ధమిట్ట గిరిజనకాలనీలో పూర్తయిన సిమెంట్ రోడ్డు



పల్లమాల కండ్రిగలో వేస్తున్న సీసీ రోడ్డు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో పల్లమాల గ్రామ పంచాయతీలో సచివాలయ నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణ పనులను వేగంగా చేస్తున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పల్లమాల గ్రామ సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో సుద్ధమిట్ట గిరిజన కాలనీలో రూ.10 లక్షలతో సిమెంట్ రోడ్డు, పల్లమాల కండ్రిగలో రూ. 5 లక్షలతో సిమెంట్ రోడ్డు, పల్లమాలలో రూ. 5 లక్షలతో డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. సర్పంచ్ జొన్నల రమణమ్మ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గోపాల్‌రెడ్డి, పీఆర్ ఏఈ నాగరాజు ఈ పనులను పర్యవేక్షించారు. గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



గతంలో సుద్ధమిట్ట కాలనీలోని మట్టి రోడ్డు (ఫైల్)

ఘనంగా గుర్రప్పస్వామి కొలుపు



జింగిలిపాళెం గంగమ్మ జాతరలో పవిత్రారెడ్డి, గ్రామస్తులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం కమ్మకొత్తూరు దళితవాడలో ఆదివారం ఘనంగా గుర్రప్పస్వామి కొలుపు నిర్వహించారు. గ్రామస్తులు ఆలయం వద్ద పూజలు చేశారు. పూజార్చన కార్యక్రమాలకు తొట్టంబేడు మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ పవిత్రారెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో సర్పంచ్ రజని రమేష్, పుల్లయ్య, దేవి, సుబ్బారావు, రామ్మూర్తి, రామారావు, సుబ్రహ్మణ్యం, కేశవులు, అశోక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, జింగిలిపాళెంలో నిర్వహించిన గంగమ్మ జాతరకూ పవిత్రారెడ్డి హాజరయ్యారు. రామచంద్రయాదవ్, హరి, కేశవ, రాజా, శంకరయ్య యాదవ్, మునీంద్రయాదవ్, వెంకట్రామయ్య యాదవ్ పాల్గొన్నారు.

తాటిపర్తిలో ఎల్లమ్మ జాతర

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): మండలంలోని తాటిపర్తిలో ఆదివారం గ్రామ దేవత ఎల్లమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు ఆమెకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉన్నం నిర్మలమ్మ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉన్నం వాసుదేవ నాయుడు, సర్పంచ్ నాగేంద్ర, ఎంపీటీసీ శోభన్ బాబు, నాయకులు రమేష్‌నాయుడు, భాస్కర్‌రెడ్డి, సూధాకర్ నాయుడు పాల్గొన్నారు.



తొట్టంబేడు : తాటిపర్తిలో..

ముక్కంటి సేవలో...



ఆలయ ధ్వజస్తంభం వద్ద సత్య భాస్కరరావు కుటుంబ సభ్యులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శి సత్య భాస్కరరావు తన కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఆలయ దక్షిణగోపురం వద్ద అధికారులు వారికి స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

79 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

ఏర్పేడు: మండలంలోని మేర్లపాక ఎస్సీ కాలనీ వద్ద శ్రీకాళహస్తి–తిరుపతి ప్రధాన రహదారిపై అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి ఆదివారం రాత్రి తెలిపారు. ఆయన కథనం..ముందస్తు సమాచారం మేరకు మేర్లపాక ఎస్సీ కాలనీ వద్ద ఏపీ 39 యూఏ8213 అశోక్ లేలాండ్ దోస్త్ ఎల్‌ఎస్ వాహనాన్ని ఆపి పోలీసులు తనిఖీ చేశారు. అందులో 4,030 కిలోల బియ్యం ఉన్న 79 ప్లాస్టిక్ బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.1,45,080. వాహనంతో పాటు రేషన్ బియ్యాన్ని రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస మొదలియార్‌కు అప్పగించారు. బియ్యాన్ని తరలిస్తున్న కేవీబీపురం మండలం కోవనూరుకు చెందిన సాంబారు మనోజ్(25)ను అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

చిల్లకూరు: మండలంలోని కడివేడులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. కోట మండలం విద్యానగర్‌కు చెందిన జగదీష్ తన సహోదరి కమలతో కలసి మోటార్‌బైక్‌పై గూడూరుకు వచ్చి తిరిగి విద్యానగర్‌కు వెళుతున్నారు. ఈ క్రమంలో కడివేడు వద్ద అకస్మాత్తుగా పొలాలలో నుంచి రోడ్డుపై వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొన్నాడు. దీంతో కమల దూరంగా ఎగిరి పడిపోవడంతో జగదీష్‌పై ట్రాక్టర్ చక్రం ఎక్కింది. ఈ ఘటనలో అతడి ఎడమ కాలు దెబ్బంది. స్థానికులు క్షతగాత్రుడిని 108లో గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు అతనికి ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. పోలీసులు ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కండలేరులో 20.616 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 20.616 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,850 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 50, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 60, లోలెవల్ స్లూయిస్‌కు120 క్యూసెక్కుల వంతున నీరు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

యువతకు మేల్కొలిపే చిత్రం

మనసిస్తావా

తిరుపతి కల్చరల్: నేడు యువత ప్రతి చిన్న విషయానికీ మనస్తాపం చెంది తొందరపాటు నిర్ణయాలు తీసుకుని తల్లిదండ్రులకు కడుపుకోతను మిగుల్చుతున్నారని దర్శకుడు రవిచంద్రారెడ్డి తెలిపారు. అలాంటి వారికి ఆత్మహత్య ఎంత తప్పిదమో తెలియజేస్తూ యువతకు కనువిప్పు కలిగించే సందేశాత్మక చిత్రం మనసిస్తావా అని పేర్కొన్నారు. ఆయన ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. తిరుపతిలోని యువత, కళాకారులను ప్రోత్సహిస్తూ సమాజానికి మంచి సందేశాత్మక చిత్రాన్ని అందించాలనే సంకల్పంతో ఈ చిత్రాన్ని నిర్మించినట్టు చెప్పారు. సమాజ శ్రేయస్సుకు తమ వంతు సహకారం అందించాలనే ఈ చిత్రాన్ని రూపొందించామన్నారు. ఈ చిన్న చిత్రాన్ని సోమవారం థియేటర్లలో విడుదల చేస్తున్నామని, ప్రజలందరూ చూసి ఆదరించాలని కోరారు. ఈ సమావేశంలో నిర్మాతలు శివారెడ్డి, నక్కా రాజేంద్రప్రసాద్, నటులు కృష్ణమూర్తి, శాస్త్రి పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



కంప్యూటర్ ఆపరేటర్ కుమారి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు: మండలంలో మృతుల కుటుంబాలను డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి, ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆదివారం రాత్రి పరామర్శించారు. పిచ్చాటూరులో పది రోజుల క్రితం మరణించిన ఉపాధి కంప్యూటర్ ఆపరేటర్ కుమారి ఇంటికి వెళ్లి ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఆమె భర్త త్యాగరాజు, కుటుంబ సభ్యులను ఓదార్చారు. అక్కడ నుంచి కీళపూడికి వారు వెళ్లారు. ఆ గ్రామంలో రెండ్రోజుల క్రితం మృతి చెందిన వైఎస్ఆర్‌సీపీ నేత క్రిష్ణమరాజు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం పిచ్చాటూరులో వైఎస్ఆర్‌సీపీ నేత గోవింద స్వామి కుమారుడు వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, ఎంపీటీసీ సభ్యులు రమేష్ రాజు, సచివాలయ మండల కన్వీనర్ తొప్పయ్య, రైతు సలహా మండలి అధ్యక్షులు చిన్నదొరై, నాయకులు మోహన్, చలపతిరాజు, చెంగల్రాయ రెడ్డి, బాబు రెడ్డి, ఎస్ఎం సురేష్, శ్యామ్, దేశప్పన్ తదితరులు పాల్గొన్నారు.

పక్కా ఇళ్లు మంజూరు చేయరూ!



పక్కా ఇళ్లు మంజూరు చేయాలని కోరుతున్న రామకృష్ణాపురం గిరిజనులు

- ప్రభుత్వానికి రామకృష్ణాపురం గిరిజనుల వినతి

వరదయ్యపాళెం: మండలంలోని గూడలవారిపాళెం పంచాయతీ రామకృష్ణాపురం గిరిజనకాలనీ వాసులు పక్కా ఇళ్ల కోసం ఎదురు చూస్తున్నారు. ఇటీవల స్థానిక సర్పంచ్ చంద్రారెడ్డి చొరవతో గిరిజనకాలనీకి చెందిన 15 కుటుంబాలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తూ పట్టాలను పంపిణీ చేశారు. అయితే సంబంధిత గిరిజనులు పక్కా ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఆ దిశగా సర్పంచ్ ద్వారా మండల హౌసింగ్ అధికారులకు విన్నవించారు. త్వరలో విడుదల చేయనున్న హౌసింగ్ ఇళ్లలో రామకృష్ణాపురం గిరిజనులకు పక్కా ఇళ్లు మంజూరు చేయిస్తామని సర్పంచ్ హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఒకే ఇంట్లో రెండు, మూడు కుటుంబాలుగా ఉంటున్నామని, ఈ ఇబ్బందుల నుంచి తమకు విముక్తి కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.

వాకర్స్ సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న కమిషనర్ వెంకట్రామిరెడ్డి

పుత్తూరు రూరల్: పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ సభ్యుల సేవలు అభినందనీయమని నగరి మున్సిపల్ కమిషనర్ కె.వెంకట్రామిరెడ్డి అన్నారు. ఆదివారం వాకర్స్ అసోసియేషన్ అదనపు భవన నిర్మాణాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. అసోసియేషన్‌ను ప్రారంభించి, పలు సేవా కార్యక్రమాలను నిర్వహించడంలో డాక్టర్ కె.శ్రీనివాసులురెడ్డి కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఒక సంఘం విజయవంతంగా నడుస్తుంటే దాని వెనక పటిష్టమైన నాయకత్వమే కారణమన్నారు. ఆ నాయకత్వ పాత్రను డాక్టర్ సమర్థవంతంగా పోషిస్తున్నారని కొనియాడారు. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ నడవడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని సూచించారు. తాను ఏడాది పాటు పుత్తూరులో పని చేశానని, అవకాశం వస్తే పుత్తూరు ప్రజలకు మళ్లీ సేవలందిస్తానని చెప్పారు. ఈ సందర్భంగా వెంకట్రామిరెడ్డిని సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు డాక్టర్ రవిరాజు, గుణశేఖర్‌రెడ్డి, గోపికృష్ణ, మురగేష్‌రెడ్డి, రామచంద్రనాయుడు, యుగంధర్‌రాజు, కుప్పయ్య శెట్టి, వెంకటేశ్వర్లునాయుడు పాల్గొన్నారు.

5.6 లీటర్ల సారా స్వాధీనం

వెంకటగిరి: వెంకటగిరి– తిరుపతి మార్గంలోని వల్లివేడు క్రాస్‌రోడ్డు వద్ద ఆదివారం ఆర్టీసీ బస్సులో సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి, 5.6 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఈబీ సీఐ పి నాగేశ్వరరావు తెలిపారు.

ఎస్‌ఈబీ సీఐ కథనం మేరకు.. వల్లివేడు క్రాస్‌రోడ్డు వద్ద ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ సిబ్బందితో తనిఖీలు చేశారు. ఆ సమయంలో తిరుపతి నుంచి వెంకటగిరి వస్తున్న ఆర్టీసీ బస్సులో తనిఖీలు చేశారు. ఆ బస్సులో రాపూరు మండలం ఏపూరు గ్రామానికి చెందిన గంగిరెడ్డి వద్ద 5.6 లీటర్ల సారా ఉండగా గుర్తించారు. నిందితుడిని విచారించగా యలమందల గ్రామానికి చెందిన రామచంద్రయ్య వద్ద సారా కొనుగోలు చేసినట్లు చెప్పాడు. ఈ మేరకు అతడిని అరెస్టు చేసి, సారా స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఈబీ సీఐ తెలిపారు.



నిందితుడి అరెస్టు చూపుతున్న ఎస్‌ఈబీ సీఐ నాగేశ్వరావు

స్వాతంత్య్ర ఉద్యమంలో ఆంధ్రుల పాత్ర విశిష్టమైంది

తిరుపతి కల్చరల్: స్వాతంత్య్ర ఉద్యమంలో ఆంధ్రుల పాత్ర విశిష్టమైందని, ఆంధ్రుల త్యాగాలు ప్రశంసనీయమైనవని ఎస్వీ ఆర్ట్స్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ కె.అప్పస్వామి పిళ్లై తెలిపారు. ఎస్కే యూనివర్సిటీ పూర్వ కులపతి కె.వెంకటరెడ్డి రచించిన భారత స్వాతంత్య్ర సమరంలో ఆంధ్రుల త్యాగాలు పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కన్నెగంట హనుమంతు, అల్లూరి సీతారామరాజు, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, పొట్టి శ్రీరాములు తమ ప్రాణ త్యాగాలతో దేశ చరిత్రలో సుస్థిర స్థానం ఏర్పరచుకున్నారని కొనియాడారు. ఎస్పీడబ్ల్యూ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ సి.స్వరాజ్యలక్ష్మి మాట్లాడుతూ అలనాటి దేశభక్తుల చరిత్రలను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. అదేవిధంగా ఆచార్య కె.వెంకటరెడ్డి ఆంగ్లంలో రచించిన ది యూనివర్సిటీ ఐ సర్వ్‌డ్ అనే మరోక పుస్తకాన్ని ఎస్వీయూ పూర్వ ఉపకులపతి పి.మురళి ఆవిష్కరించారు. సాకం నాగరాజు, రాయప్రోలు సోము ఉమాపతి, తిరుపతి ఆర్ట్స్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు హేమాక్షి ఆచారి, ఇస్తాపురం బాలసుబ్రమణ్యం, విశ్రాంత ఆచార్యులు ఎస్వీ.నారాయణ, కె.వెంకటాచలపతి, కేవీ.శ్రీనివాసకుమార, కె.విజయ, ఎం.వెంకటరామిరెడ్డి, కె.బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు